
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024



జగన్ ప్రభుత్వంపై ప్రధాని నిప్పులు

- చెరకు రైతులను ఆదుకుంటామని హామీ

జగన్ పరిపాలనపై తాళ్లపాలెం సభలో ప్రధాని నరేంద్రమోదీ నిప్పులు చెరిగారు. తండ్రి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు (ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ప్రస్తావిస్తూ)ను పూర్తి చేయలేకపోయిన కొడుకు అని విమర్శించారు. అనకాపల్లి జిల్లాలో చెరకు రైతులను ఆదుకోవడం లేదని, అందుకే వారు పంటలు వేయడం లేదని, దాంతో షుగర్ ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయన్నారు. ఎన్డీఏని గెలిపిస్తే చెరకు రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన అశేష జనం

చంద్రబాబునాయుడు అభివాదం

ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ అభివాదం

పోటెత్తిన ప్రజా గళం

తాళ్లపాలెం సభ సూపర్ సక్సెస్

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు

- ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడుల ప్రసంగాలకు విశేష స్పందన
- చెరకు రైతుల సమస్యలు ప్రస్తావించిన మోదీ

అనకాపల్లి/కశింకోట, మే 6 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతమైంది. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఏర్పాటుచేసిన సభకు దేశ ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తరాంధ్ర టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు నరేంద్రమోదీ, చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు వేలాది మంది తరలివచ్చారు. సాయంత్రం ఐదు గంటలకు మోదీ, చంద్రబాబు సభాస్థలికి వస్తారని ప్రకటించినా మధ్యాహ్నం మూడు గంటల నుంచే ప్రాంగణంలోకి జనం రాక ప్రారంభమైంది. ప్రధాని సభ కావడంతో సుమారు రెండు వేల మంది పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు.


వివిధ ప్రాంతాల నుంచి సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించి, పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ప్రధాని మోదీ, చంద్రబాబు వచ్చే సమయానికి సభా ప్రాంగణం నిండిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబు విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో 5.20 గంటలకు సభాస్థలికి చేరుకున్నారు. ప్రధాని మోదీ రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో 5.40 గంటలకు ... మిగతా 8వ పేజీలో



ప్రధాని మోదీని సత్కరిస్తున్న చంద్రబాబునాయుడు



ఏటికొప్పాక బొమ్మను మోదీకి బహూకరిస్తున్న నాగబాబు



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

ఉత్తరాంధ్రకు వైసీపీ ద్రోహం

- సుజల స్రవంతి, పోలవరం జగన్ పూర్తి చేయలేకపోయాడు
- విశాఖ భూములపై వైసీపీ నేతల కన్ను
- అసలు ఇక్కడ విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పెత్తనం ఏమిటి?
- తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

అనకాపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ భూములపై వైసీపీ నేతలు కన్నేశారని, ఉత్తరాంధ్ర ప్రాంతంపై విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పెత్తనం పెరిగిందని, ప్రశాంతతకు మారుపేరైన ఈ ప్రాంతాన్ని దోపిడీకి కేంద్రంగా చేసుకున్నారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో సోమవారం రాత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు ఈ ప్రాంతంపై పెత్తనం చేయడమేమిటని చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు వైసీపీ నాయకులు ద్రోహం చేశారని విమర్శించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం పూర్తికాకుండా చేశాడని జగన్‌పై విరుచుకుపడ్డారు. ఉత్తరాంధ్ర అంటే బీసీలు గుర్తుకు వస్తారని, టీడీపీకి కంచుకోటగా ఉత్తరాంధ్ర నిలిచిందన్నారు. ఇప్పుడు జనసేన, టీడీపీ, బీజేపీ ... మిగతా 8వ పేజీలో

నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్ కొనసాగింపు

అనకాపల్లి కలెక్టరేట్, మే 6: జిల్లాలోని ఎన్నికల విధులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 7, 8 తేదీల్లో కూడా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ గవరపాలెం బాలుర హైస్కూల్‌లోను, చోడవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, మాడుగుల నియోజకవర్గంలోని ఆర్‌సీఎం స్కూల్‌లోను, ఎలమంచిలి నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం, నర్సీపట్నం నియోజకవర్గంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు.

జన చైతన్యం

ప్రభుత్వం మారితేనే మంచిది...

- గత ఎన్నికల్లో వైసీపీకి ఓటేశాం... ఈ ఐదేళ్లలో మా సమస్యలు పట్టించుకున్న పాపానపోలేదు
- గూడెంకొత్తవీధి మండలం శివారు కొమ్ముసంపంగి గిరిజనుల మనోగతం - 7లో

జగన్‌కు ఉద్యోగులు ఝలక్!

ఇబ్బందులు పెట్టినందుకు ఓటుతో సమాధానం ఇచ్చాం

- పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగుల మనసులోని మాట

అనకాపల్లి టౌన్, మే 6:

'సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చనందుకు ఓటు రూపంలో సరైన గుణపాఠం చెప్పాం. ఐదేళ్లుగా ఇబ్బందులకు గురిచేసినందుకు మా సత్తా ఏమిటో చూపించాం. సమయానికి జీతాలు చెల్లించకపోవడంతో పాటు ఏరియర్స్, డీఏ ఇవ్వనందుకు మా నిరసనను ఓటు రూపంలో తెలియపరిచాం. సమస్యలు పరిష్కరించాలని నిరసనలు తెలియజేయడానికి ప్రయత్నిస్తే మమ్మల్ని నిర్బంధాలకు గురిచేసినందుకు ఓటు ద్వారా బదులు చెప్పాం. ఉద్యోగులంతా కలిసికట్టుగా కూటమికి ఓటు వేశాం'... అని సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు తమ మనసులోని మాటను తెలియజేశారు.

అనకాపల్లి జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే అనకాపల్లి నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈ ఓటింగ్‌లో పాల్గొన్న అధిక శాతం ఉద్యోగులు కూటమికే తమ ఓటు వేశామని చెప్పారు. ఉపాధ్యాయులను అనేక రకాలుగా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెట్టడంతో వ్యతిరేకత కనబరచక తప్పలేదని ఓ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉద్యోగ భద్రత కరువైందని, కార్పొరేషన్‌గా ఉన్నప్పుడే ఉద్యోగ భద్రత ఉండేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్మికులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం వల్ల ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయక తప్పలేదని ఆర్టీసీ ఉద్యోగి చెప్పారు. పరిపాలన బాగోలేదని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి ఒకరు వెల్లడించారు.



నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఓటు వేసేందుకు బారులుతీరిన ఉద్యోగులు

అనకాపల్లిలో ఐదు పోలింగ్ బూత్‌లు

జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మధుసూదనరావు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అనకాపల్లి పట్టణం, రూరల్, కశింకోట మండలాల ఉద్యోగులకు వేర్వేరుగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా, పోలీస్, అత్యవసర విభాగం ఉద్యోగులకు మరొకటి, నియోజకవర్గ పరిధిలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న వారి కోసం మరో బూత్ ఏర్పాటు చేసినట్టు ఏఆర్‌వో తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. నియోజకవర్గంలోని 2,533 మంది ఉద్యోగులకు గాను 968 మంది(38 శాతం) పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మధుసూదనరావు తెలిపారు. దయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ రాత్రి సుమారు ఎనిమిది గంటల వరకు కొనసాగింది. ఆరు గంటలకే పోలింగ్ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ 67 మంది అప్పటికే క్యూలో ఉండడంతో వారందరికీ స్లిప్‌లు ఇచ్చి పోలింగ్‌లో పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జాహ్నవి పరిశీలించారు. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కూడా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కాగా ఈ పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లుగా రాజకీయ పార్టీల నాయకులు వ్యవహరించడం విశేషం.

ఈ క్షణం కోసమే ఎదురుచూశాం

నక్కపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో చుక్కలు చూపించిందని, ఎన్నికలు జరిగే ఈ క్షణం కోసమే తామంతా ఎదురుచూశామని, ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతామని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు తెలిపారు. ఈ ప్రభుత్వంలో జీతాలు సకాలంలో అందలేదని, సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, అందుకే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ సత్తా చూపామని పలువురు ఉద్యోగులు వెల్లడించారు. పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఉద్యోగులు

సీరియల్ కిల్లర్ అరెస్టు

మూడు హత్యలు చేసి తప్పించుకు తిరుగుతున్న యువకుడు

- ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తూ ఘాతుకాలు
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- నిందితుడి నుంచి రూ.3 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హరి

మాకవరపాలెం, మే 6: మూడు హత్యలు చేసి గత కొన్ని నెలలుగా తప్పించుకొని తిరుగుతున్న ఓ హంతకుడిని సోమవారం అరెస్టు చేశామని నర్సీపట్నం రూరల్ సీఐ హరి, మాకవరపాలెం ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ హత్యలకు సంబంధించిన వివరాలను వారు విలేకరులకు వెల్లడించారు. ఈ హత్యలను వి.మాడుగుల మండలం జంపెన గ్రామానికి చెందిన పి.ఉపేంద్ర(24) చేశాడని చెప్పారు. ఉపేంద్ర ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. మండలంలోని జెడ్.గంగవరం గ్రామానికి చెందిన రుత్తల శివశంకర్(24)తో పరిచయం పెంచుకు న్నాడు. గంజాయి వ్యాపారం చేద్దామని నమ్మించి రూ.2 లక్షల నగదు తీసుకుని జెడ్.గంగవరం గ్రామం శివారున ఉన్న జీడిమామిడి తోటల్లోకి రమ్మన్నాడు. దీంతో శివశంకర్ గత నెల 29వ తేదీ రాత్రి 7 గంటలకు నగదుతో అక్కడికి వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న ఉపేంద్ర కర్రతో శివశంకర్ తలపై బలంగా కొట్టి హత మార్చాడు. ఆ నగదు తీసుకుని వెళ్లిపోతే పోలీసులను పక్కదారి పట్టించేందుకు పలు రకాల వస్తువులను అక్కడ వదిలిపెట్టాడు. ఈ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేశారు. ఈ హత్య జరగడానికి వారం క్రితం ఉపేంద్ర ఉంటున్న రూమ్‌కి శివశంకర్ వెళ్లడం ఓ యువకుడు చూశాడు. దీని ఆధారంగా విచారణ చేపట్టి ఉపేంద్రను అరెస్టు చేశారు. అతని నుంచి రూ.2 లక్షల నగదు, హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు.

వెలుగులోకి మరిన్ని హత్యలు

ఉపేంద్రను పోలీసులు విచారించినప్పుడు మరిన్ని హత్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1న లచ్చన్నపాలెం వలంటీర్ హరినాథ్(24)ను ఉపేంద్ర హత్య చేసి అతని వద్ద ఉన్న లక్షరూపాయలు కాజేశాడు. పోలీసులు ఆ నగదును, హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2022లో అనకాపల్లి జిల్లా మునగపాకలో గంగా మహాలక్ష్మినాయుడు (24)ను ఉపేంద్ర హత్య చేశాడు. ఈ హత్యలన్నీ డబ్బు కోసమే చేశాడు. కొందరు యువకులను ఎంచుకుని వారితో స్నేహం చేసి లిక్విడ్ గంజాయి వ్యాపారం చేద్దామని చెప్పి నగదు తీసుకుని ఈ హత్యలు చేశాడని పోలీసులు తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవాడని చెప్పారు. హత్య చేసేటప్పుడు ఫోన్ వాడకుండా, అలాగే పోలీసులను పక్కదారి పట్టించేందుకు చాలా జాగ్రత్తలు పాటించాడని తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు పనిచేసిన స్థానిక పోలీసు సిబ్బంది జి.శ్రీను, పి.రామకృష్ణ, వరహాలు బాబును జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.


తాళ్లపాలెం సభకు హాజరైన జన సందోహం


ప్రసంగం ముగిసిన అనంతరం ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ


ప్రధాని మోదీకి అనకాపల్లి బెల్లం బహూకరిస్తున్న సీఎం రమేష్

ప్రజాగళం సూపర్ సక్సెస్

⏩ వెల్లువలా తరలివచ్చిన జనం

⏩ మోదీ, బాబు నినాదాలతో మార్మోగిన సభా ప్రాంగణం

⏩ మూడు పార్టీలో జోష్ నింపిన తాళ్లపాలెం సభ




అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ అయింది. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరుకావడంతో భారీ సంఖ్యలో ప్రజలు, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. మోదీ, బాబు నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

- అనకాపల్లి, ఆంధ్రజ్యోతి


వేదికపై చంద్రబాబుతో కూటమి అభ్యర్థులు కలిశెట్టి, కొణతాల, గంటా, సీఎం రమేష్, సుందరపు, బండారు, అనిత,



మహిళ ఉత్సాహం

నేతల ప్రసంగాలు


సీఎం రమేష్ (అనకాపల్లి ఎంపీ అభ్యర్థి)



కొత్తపల్లి గీత (అరకు ఎంపీ అభ్యర్థి)


ఎం.శ్రీభరత్ (విశాఖ ఎంపీ అభ్యర్థి)


అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం అభ్యర్థి)


అనిత (పాయకరావుపేట అభ్యర్థి)


కొణతాల (అనకాపల్లి అభ్యర్థి)


నాగబాబు (జనసేన నాయకుడు)


మాధవ్ (బీజేపీ నాయకుడు


ప్రధాని మోదీతో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, చంద్రబాబు మాటా మంతీ


సభా ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో జనాన్ని నియంత్రిస్తున్న పోలీస్ రోప్ పార్టీ


రాజస్థానీ తలపాగాలతో మోదీ నినాదాలు చేస్తున్న మహిళలు


సభా ప్రాంగణం నిండిపోవడంతో రోడ్డుపైనే ఉండి పోయిన జనం


సభా ప్రాంగణంలోకి వెళ్తున్న అశేష జనవాహిని


సభకు వివిధ రకాల వాహనాలతో తరలివస్తున్న జనం


వేదికపై చర్చిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, బీజేపీ నాయకులు పీఎన్ మాధవ్, టీడీపీ మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి


సీఎం రమేష్, చంద్రబాబు మాటా మంతీ


ప్రజాగళం సభలో మోదీ చిత్ర పటాలతో మహిళల సంబరాలు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

⏩ జనసేన రాష్ట్ర కార్యదర్శి కె.నాగబాబు

అనకాపల్లి, మే 6 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అభివృద్ధి జరుగుతుందని జనసేన రాష్ట్ర కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. సోమవారం తాళ్లపాలెంలో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు కూల్చేశారన్నారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు, అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సామాన్యుల ఆస్తులకు రక్షణ లేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు అడ్డాగా మార్చేశారన్నారు. రాష్ట్రంలో పాలన గాడిలో పడాలంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవసరమన్నారు.

సైకోను తరిమికొట్టాలి : అయ్యన్నపాత్రుడు

రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సైకో జగన్‌ను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తరిమి కొట్టాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీలు ఏకమయ్యాయన్నారు. రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా మారడానికి కారణం జగన్ అన్నారు.రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం, కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పడడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి : సీఎం రమేశ్

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు ద్వారా రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తుందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పరుగులు పెట్టడం ఖాయమన్నారు. జగన్ పెన్షన్ రూ. 3 వేలు ఇస్తే, చంద్రబాబు పెన్షన్ రూ.4 వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. అంతే కాకుండా మహిళలు, యువకులు, నిరుద్యోగుల కోసం అనేక సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పెట్టారన్నారు. చంద్రబాబు తన అనుభవంతో సంపద సృష్టించడమే కాకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కాగా అమలు చేయగలరన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులే : అనిత

ఒక్క చాన్స్ అని గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందుల పాలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని టీడీపీ పాయకరావుపేట అసెంబ్లీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. అధికార మదంతో రాష్ట్ర ప్రజలనే కాకుండా సొంత తల్లి, చెల్లిని మోసం చేసిన ఘనుడు జగన్ అని ఆరోపించారు. ఉద్యోగులు పెద్దసంఖ్యలో క్యూలో నిలబడి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడాన్ని చూస్తే జగన్ పతనం ప్రారంభమైందని అందరికీ అర్థమవుతుందన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రజలు, ప్రయోజనాల కోసం జరుగుతున్న యుద్ధమన్నారు. సైకో జగన్‌ను ఎన్నికల్లో తరమి కొట్టేందుకు ప్రతిక్కొరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

విశాఖలో రౌడీల పాలన : ఎం. శ్రీభరత్

ప్రశాంతతకు మారుపేరైన విశాఖపట్నంలో వైసీపీ పాలనలో రౌడీలకు కేంద్రంగా మారిందని టీడీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి ఎం. శ్రీభరత్ అన్నారు. తాజాగా ఒక ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేయడం, తహసీల్దారు హత్యలే ఇందుకు నిదర్శనమన్నారు. విశాఖలోనే కాకుండా వైసీపీ పాలనలో రాష్ట్రంలో ప్రజలకు భద్రత కరువయ్యిందన్నారు. ల్యాండ్, శాండ్ మాఫియా చెలరేగిపోతున్నాయని ఆరోపించారు. మద్య పానం నిషేధం విషయంలో వైసీపీ ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. ఐదేళ్ల క్రితం మద్యం ఆదాయం రూ.7 వేల కోట్లు ఉంటే.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.25 వేల కోట్లు దోచేశారని ఆరోపించారు. ధరలు పెంచేయడమే కాకుండా నాసిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి : కొణతాల

రాష్ట్రంలో వైసీపీ అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దోపిడీ, కక్ష సాధింపు విధానాలతో వైసీపీ పాలన సాగిందని ఆరోపించారు. నిరుద్యోగుల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలోనూ, మహిళల అదృశ్యంలో మూడో స్థానంలో ఉండడానికి వైసీపీ అరాచక పాలనే కారణమన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమే మూడు పార్టీలు కలిసి పోరాటాలు సాగిస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో దుష్టపాలన : కొత్తపల్లి గీత

రాష్ట్రంలో వైసీపీ హయాంలో దుష్టపాలన సాగుతోందని బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలు చూసి చలించిపోయి మూడు పార్టీలు కలిసి పోరాడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఒక్క చాన్స్ అని గద్దెనెక్కి అన్ని వర్గాల వారిని మోసం చేసి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని జగన్ ఓట్లు అడుగుతున్నారో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.

నాగబాబుకు ఘన స్వాగతం


నాగబాబుకు స్వాగతం పలుకుతున్న జనసైనికులు

అనకాపల్లి టౌన్, మే 6: జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.నాగేంద్రబాబుకు సోమవారం మధ్యాహ్నం పట్టణంలో జన సైనికులు ఘనస్వాగతం పలికారు. పిఠాపురం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నాగేంద్రబాబు అనకాపల్లికి సమీపంలోని హెలిప్యాడ్ వద్ద దిగారు. ఈ సందర్భంగా జనసైనికులు శ్రీరామదాసు గోవిందరావు, మళ్ల శ్రీను, రాము, గణేష్ నాగేంద్రబాబుకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నాగేంద్రబాబు ప్రత్యేక వాహనంలో ఉగ్గినపాలెం వద్ద జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రచార సభకు వెళ్లారు.

ఈత కోసమని వెళ్లి బావిలో పడి యువకుడి మృతి


మృతి చెందిన పాల్‌సరోజ్

ఎలమంచిలి, మే 6: ఈత కోసం వెళ్లి బావిలో పడి హైదరాబాద్ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఓ అపార్ట్‌మెంటులో చలపాక రాజు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని పెద్ద కుమారుడు చలపాక పాల్‌సరోజ్(23) అక్కడే టాటా కేపిటల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కశింకోట సమీప గ్రామంలో తన మేనత్త ఇంట్లో శుభకార్యానికి ఆదివారం ఉదయం పాల్‌సరోజ్ వచ్చాడు. కార్యక్రమం చూసుకుని ఎలమంచిలిలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడ తన స్నేహితులు, బంధువైన గౌతమ్, ప్రణీత్‌లతో కలిసి పాల్‌సరోజ్ సోమన్నపాలెం సమీపంలోని బావి వద్దకు ఈత కొట్టడానికి వెళ్లారు. గౌతమ్, ప్రణీత్‌లు బావిలో స్నానం చేస్తుండగా పాల్‌సరోజ్‌కు ఈత రాదని దిగేందుకు ప్రయత్నిస్తుండగా బావిలో పడిపోయాడు. స్థానికుల సాయంతో పాల్ సరోజ్‌ను బయటకు తీసి సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474



ప్రభుత్వం మారితేనే మంచిది...

గత ఎన్నికల్లో వైసీపీకి ఓటేశాం...
ఈ ఐదేళ్లలో మా సమస్యలు పట్టించుకున్న పాపానపోలేదు

- కనీసం గ్రామానికి రహదారి సౌకర్యం కూడా కల్పించలేదు
- పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా లేవు
- ఒక్కరికీ పక్కా ఇల్లు లేదు... అంతా పాకల్లోనే ఉంటున్నాం
- అమ్మఒడి, చేయూత లాంటి పథకాలేవీ అందలేదు
- ఇప్పటివరకూ ఓటు అడిగేందుకు ఎవరూ రాలేదు
- అధికార పార్టీ నాయకులు వస్తే సమస్యలపై నిలదీద్దామనుకున్నాం
- గూడెంకొత్తవీధి మండలం శివారు కొమ్ముసంపంగి గిరిజనుల మనోగతం
- అడవి బిడ్డల్లో వైసీపీపై అసంతృప్తి సెగలు

"జగన్ పథకాలు అందడం లేదు. గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేశాం, ఐదేళ్లలో మా సమస్యలు పట్టించుకున్నది లేదు, ప్రభుత్వం మారితే బాగుంటుందని అనుకుంటున్నాం"... అంటున్నారు అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి పంచాయతీ శివారు కొమ్ము సంపంగి గిరిజనులు. ఎన్నికల నేపథ్యంలో శివారు గిరిజన గ్రామాల ఆదివాసీల నాడి పట్టుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు కొమ్ముసంపంగి గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఈ గ్రామం గూడెంకొత్తవీధి-కొయ్యూరు మండలాల్లో సరిహద్దు ప్రాంతాల్లో ఉంది. గ్రామంలో 30 ఆదివాసీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఓటు హక్కు కలిగినవారు 60 మంది ఉన్నారు. వారిలో ఐదుగురు యువకులు తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రామంలో సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల గురించి ఋవురు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...

గ్రామానికి బీఎల్‌వో వచ్చి మే 13న ఓటు వేయాల్సి ఉంటుందని చెప్పాడు. మేమంతా ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం. గ్రామానికి ఇంతవరకూ వైసీపీ, టీడీపీ, ఇతర నాయకులు ఎవరూ రాలేదు. వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పథకాల గురించి విన్నాం. మా గ్రామంలో అయితే ఏ ఒక్కరికీ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. వైసీపీ నాయకులు గ్రామానికి వస్తే ఐదేళ్లుగా మా సమస్యలు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించాలని ఎదురుచూస్తున్నాం. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఏమి చేస్తారో చెప్పేందుకు నాయకులు రాలేదు. మేనిఫెస్టో విడుదల చేసినట్టు తెలియదు. వైసీపీ ప్రభుత్వ పాలన ఐదేళ్లు చూశాము. మా సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ఏ నాయకుడూ రాలేదు. ప్రభుత్వ పథకాల కోసం పలుమార్లు అధికారులకు దరఖాస్తులు ఇచ్చినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారితే మంచిదని భావిస్తున్నాము. ఇంతవరకు ఎవరికి ఓటు వేయాలనేది నిర్ణయించుకోలేదు. మా గ్రామానికి వచ్చి మా సమస్యలు తీరుస్తామని ఎవరు హామీ ఇస్తే ఆ పార్టీకి ఓటు వేయాలని నిర్ణయించుకున్నాము. జగన్ పాలన చూశాం కాబట్టి మళ్లీ వైసీపీకి ఓటు వేయకూడదని అభిప్రాయంతో ఎక్కువ మంది ఉన్నారు.


సాగు భూములకు పట్టాలు లేక రైతు భరోసా అందని గిరిజనులు

సమస్యల వలయంలో కొమ్ముసంపంగి..

మా గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఏ ఒక్క కుటుంబానికి పక్కా గృహం లేదు. గ్రామస్థులమంతా పాకల్లోనే నివాసం ఉంటున్నాము. గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. బడిఈడు పిల్లలు 20 మంది, అంగన్‌వాడీ వయస్సు పిల్లలు 12 మంది ఉన్నారు. బడి ఈడు పిల్లలు చదువుల కోసం 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాములాయి గ్రామానికి వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలం పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలకు ఏనాడూ పోషకాహారం వండి పెట్టింది లేదు. సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోనున్న కంపుమానుపాకలు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త నెలకు సరిపడిన సరకులను ఒకేసారి పంపిణీ చేస్తుంది. మహిళలు కంపుమానుపాకలు వెళ్లి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన నెల సరకులు తెచ్చుకుంటున్నారు. గ్రామానికి రహదారి సదుపాయం లేదు. ఈ గ్రామాన్ని కలుపుతూ పాములాయి జంక్షన్ నుంచి పుట్టకోట వరకు ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకం ద్వారా 2020 నవంబరులో తారు రోడ్డు మంజూరైంది. నిర్మాణాలకు రూ.13.66 కోట్లు కేటాయించారు. ఈ రహదారి 2021 నవంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నిధులు విడుదల కాకపోవడం, వైసీపీ పాలకులు పట్టించుకోకపోవడం వల్ల నేటి వరకు పనులు పూర్తికాలేదు. కాంట్రాక్టర్ కొంత వరకు మెటల్ వేసి అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో గ్రామానికి ద్విచక్ర వాహనాలు అతికష్టంపై వస్తున్నాయి. ఇతర వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించే పరిస్థితి లేదు. గ్రామంలో ఒక్క కుటుంబానికి కూడా టీవీ లేదు. సెల్ సిగ్నల్స్ అదుబాటులో లేవు. గ్రామానికి చెందిన గిరిజనులు సంతకు జీకే వీధి వస్తేనే బాహ్యప్రపంచం విషయాలు తెలుస్తాయి. లేదంటే ఎవరైనా గ్రామానికి వచ్చిన వర్తకుల ద్వారా బయట విషయాలు తెలుసుకుంటున్నాము.

● చింతపల్లి/గూడెంకొత్తవీధి


కొమ్ముసంపంగిలో బడి ఈడు, అంగన్‌వాడీ పిల్లలు

అసంపూర్తిగా రహదారి



2020లో పాములాయి నుంచి మా గ్రామం మీదుగా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. రహదారి వస్తుందని సంబరపడిపోయాము. 2021 నుంచి నేటి వరకు పనులు జరగడంలేదు. రహదారి నిర్మాణం ఎందుకు నిలిచిపోయాయో తెలియడంలేదు. రహదారి పూర్తి చేయాలని మండల పరిషత్ అధికారులకు విన్నవించుకున్నాం. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. రహదారిలేక చాలా ఇబ్బందిపడుతున్నాం. జీకే వీధికి కాలినడకన వెళ్లాల్సి వస్తుంది.

\- సీందేరి కాంద్రు, కొమ్ము సంపంగి.

అమ్మఒడి అందడం లేదు



నా కూతురు పాములాయి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది. నాలుగేళ్లుగా అమ్మఒడి వస్తుందని చెప్పారు. ఒక్క ఏడాది కూడా రాలేదు. గ్రామ సచివాలయాలనికి వెళ్లి పలుమార్లు దరఖాస్తులు ఇచ్చాము. చదువుకుంటున్న పిల్లలకు అమ్మఒడి ఇస్తున్నారని చెబుతున్నా మా గ్రామంలో తల్లులకు అందడం లేదు.

\- వంతల చిలక, కొమ్ముసంపంగి

అందని రైతు భరోసా..

గ్రామంలో కేవలం ఏడుగురికి మాత్రమే భూమి పట్టాలు ఉన్నాయి. 23 మంది రైతులకు పట్టాలు లేవు. పట్టాలు కలిగిన ఏడుగురిలో ఐదుగురికి రైతు భరోసా నిధులు అందుతున్నాయి. మరో ఇద్దరికి అందడం లేదు. ఇతర రైతులకు పట్టాలు లేకపోవడం వల్ల రైతు భరోసాకు దూరంగా ఉన్నారు. అటవీ హక్కుల పట్టాలు అందజేస్తామని గత ఐదేళ్లలో మూడు సార్లు సర్వే చేశారు. అయితే నేటికి ఒక్క రైతుకు కూడా పట్టాలు అందజేసిన దాఖలాలు లేవు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో మంచినీరు, విద్యుత్ సదుపాయం..

కొమ్ముసంపంగి గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు. అప్పటివరకు ఆదివాసీలు కిరోసిన్ దీపాల వెలుగులోనే జీవనం సాగించాము. 2018లో సోలార్ విద్యుత్ స్థానంలో గ్రిడ్ విద్యుత్ సదుపాయం కల్పించారు. అదే ఏడాది గ్రావిటీ పథకం నిర్మించి పబ్లిక్ కొళాయిలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్థానిక ఆదివాసీలకు మంచి నీటి సమస్యలేదు.

వైసీపీ హయాంలో ప్రభుత్వ పథకాలకు దూరంగా..

గ్రామానికి చెందిన ఆదివాసీల్లో అర్హులైన ఎనిమిది మంది మహిళలు ఉన్నప్పటికీ చేయూత నగదు అందడం లేదు. ఇద్దరు మహిళలకు ఈ ఏడాది చేయూత మంజూరైనట్టు పేర్లు వచ్చినప్పటికీ నగదు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదు. ఆరుగురు తల్లులకు అమ్మఒడి పథం అందడం లేదు. పలు మార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటికీ అమ్మఒడి రావడం లేదని ఆదివాసీ మహిళలు చెబుతున్నారు. కొత్తగా పెళ్లికాబడిన ఐదు కుటుంబాలకు రేషన్ కార్డులులేవు.

వైసీపీ ప్రభుత్వం మారాలి



గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేశాం. ఐదేళ్లుగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికి ఏనాడూ ఆ పార్టీ నాయకులు, అధికారులు గ్రామానికి వచ్చి అడిగి తెలుసుకున్నది లేదు. మా నాన్న వంతల సత్యనారాయణకు పట్టా ఉన్నప్పటికీ రైతు భరోసా రావడం లేదు. ప్రభుత్వం మారితేనైనా మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నాం.

\- వంతల దాసు, కొమ్ముసంపంగి

ఐదేళ్లలో ఒక్కసారి కూడా చేయూత అందలేదు



నా వయస్సు 48 సంవత్సరాలు, చేయూత కోసం ఐదేళ్లుగా దరఖాస్తు చేస్తున్నాను. ఒక్క ఏడాది కూడా వచ్చిందిలేదు. ఈ ఏడాది నాపేరు చేయూతలో వచ్చిందని గ్రామ సచివాలయం ఉద్యోగులు చెప్పారు. ఇంత వరకూ నగదు బ్యాంకు ఖాతాలో జమకాలేదు. మా సమస్య పట్టించుకోని వైసీపీకి ఎందుకు ఓటు వేయాలి.

\- సిందేరి బందో, కొమ్ముసంపంగి

పట్టాలిస్తామని మూడుసార్లు సర్వే చేశారు



నాకు నాలుగు ఎకరాల సాగు భూమి ఉన్నది. సాగు పట్టా లేదు. పట్టాల కోసం పలుమార్లు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాము. రెవెన్యూ అధికారులు మూడుసార్లు వచ్చి సర్వే చేశారు. పట్టాలు వస్తున్నాయని వీఆర్వో చెబుతున్నప్పటికీ ఇంతవరకు మాకు అందలేదు. పట్టాలు లేకపోవడం వల్ల రైతు భరోసా అందడం లేదు.

\- వంతల రాము, కొమ్ముసంపంగి

మా సమస్యలు పరిష్కరించే వారికే ఓటు



మా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవారికే ఓటు వేస్తాం. మా కుటుంబానికి రేషన్ కార్డులేదు. పలు మార్లు దరఖాస్తు చేశాము. ఇంతవరకూ మంజూరుకాలేదు. ఐదేళ్ల వైసీపీ పాలన చేశాము. మా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చే కొత్త పార్టీలకు ఓటు వేస్తాము.

\- పాంగి చంద్ర, పాంగి టిక్కాయి, కొమ్ముసంపంగి

ఓటరు మాట

ధరలు దిగి రావాలి



ప్రస్తుతం నిత్యావసరాలతో పాటు అన్ని వినియోగ వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేద మధ్య తరగతి వర్గాల ప్రజలకు బతుకు భారమవుతోంది. ధరలు తగ్గిస్తామని గతంలో మాటిచ్చిన ప్రతినిధులు అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. ఇప్పుడు సమయం మనది. ఓటర్లు చిత్తశుద్ధిని, నిజాయితీని నిరూపించుకోవాలి. మాటిచ్చి అమలు చేయగల సత్తా ఉన్న నేతలను, ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి. ప్రజా సంక్షేమంపై ఆలోచనలున్న నాయకులకు ఓటు వేసి చట్టసభలకు పంపాలి. - సుజాత పూజారి, మాధవధార

తాయిలాలకు లొంగొద్దు



ప్రజావసరాలు గుర్తించి, వాటిపై చట్టసభల్లో గళం విప్పగల నాయకులను ఎన్నుకోవాలి. పదవి, పలుకుబడి, సంపాదన కోసం రాజకీయాల్లోకి వచ్చిన వారికి, గతంలో చట్టసభల్లో మౌనంగా ఉన్న వారికి ఓటు వేయడం నిరర్థకం. లోక్‌సభ, శాసనసభలకు పోటీ చేసే వారిలో సమర్థులను గెలిపించాలి. ప్రలోభాలు, తాయిలాలకు లొంగి అనర్హులకు ఓటువేస్తే మరో ఐదేళ్లు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటువేయాలి

\- ఉమ్మిడి దేవుడు, పెదగంట్యాడ

మంచి నేతలను ఎన్నుకుందాం



శాసనసభలో జరుగుతున్న చర్చల్లో ప్రజలకు ఉపయోగపడేవి లేవు. నేతలు పరస్పరం విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. చట్టసభల్లో హుందాగా వ్యవహరిస్తూ ప్రజాసమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలను అన్వేషించే అనుభవం ఉన్న నాయకులను ఎన్నుకోవాలి. ఐదేళ్లకోసారి వచ్చే అద్భుత అవకాశాన్ని భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా వినియోగించుకుందాం. అందరం ఓటువేసి మంచి నాయకులను ఎన్నుకుందాం.

\- గరికిన రత్న, భీమిలి

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్... 9848212243

సర్ విజ్జీ... మన ఎంపీ!

- 1962లో విశాఖ నుంచి లోక్‌సభకు ఎన్నిక
- విజయనగరం సంస్థానాధీశుడు పీవీజీ రాజుకు చిన్నాన్న
- 1954లోనే బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు
- క్రికెట్‌కు గౌరవం తీసుకువచ్చిన భారత్ కెప్టెన్

మీకు తెలుసా!

క్రికెట్ అంటే వెంటనే గుర్తుకొచ్చే పేరు సర్ విజ్జీ.. ఈయన ఎవరో కాదు విజయనగరం సంస్థానాధీశుడు పీవీజీ రాజుకు స్వయంగా చిన్నాన్న. చిన్నప్పటినుంచి బెనారస్‌లో పెరిగిన ఈయన పూర్తి పేరు పూసపాటి విజయానందగజపతిరాజు ఉరఫ్ మహారాజకుమార్ (విజ్జీ). 1926లో సొంతంగా క్రికెట్ జట్టును ఏర్పాటు చేసుకుని ప్రతిభ చూపిన విజ్జీ 1938లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. దేశంలో క్రికెట్‌కు తగిన గౌరవం, ఖ్యాతిని కల్పించడంలో విశేషంగా కృషి చేశారు. దీంతో బీసీసీఐ ఇతనిని 1952లో బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా నియమించింది. ఆ తరువాత 1954 నుంచి 1957 వరకు మూడేళ్లపాటు ఈయన బీసీసీఐ అధ్యక్షుడిగా పని చేశారు. ఆ సమయంలో దేశంలో క్రికెట్‌కు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు ఎంతోమంది క్రీడాకారులను వెలికితీసి, భారత జట్టుకు అందించారు. కాగా 1962 ఎన్నికల సమయానికి విజ్జీ విశాఖలోనే ఉండేవారు. దీంతో ఆయనను విశాపట్నం లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని పీవీజీ రాజు పట్టుబట్టారు. ఆ ఎన్నికల్లో భీమిలి నుంచి శాసనసభకు పోటీ చేసేందుకు పీవీజీ ఆసక్తి కనబరచడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విజ్జీ లోక్‌సభకు పోటీచేసి విజయం సాధించారు. అయితే పూర్తికాలం పదవిలో కొనసాగకుండానే 1965లో ఆయన కన్నుమూశారు. క్రికెట్‌కు వన్నెతెచ్చిన సర్ విజ్జీ విశాఖ ఎంపీగా కూడా పనిచేశారనే విషయం నేటి తరంలో చాలామందికి తెలియని విషయమే.


పూసపాటి విజయానంద గజపతిరాజు (విజ్జీ)

● భీమునిపట్నం రూరల్

జమిలి ఎన్నికల్లో ఏకపక్షమే!

- పెందుర్తి ఓటర్ల తీర్పు
- ఒరవడికి ఒక్కసారే బ్రేక్..

అసెంబ్లీ, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించినసందర్భంలో పెందుర్తి ఓటర్లు ఏకపక్షంగానే తీర్పునిస్తున్నారు. అసెంబ్లీ నియోజవర్గంగా 1977లో ఏర్పడిన పెందుర్తి విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉండేది. 1989లో ఒకేసారి జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పెందుర్తి నుంచి కాం గ్రెస్ పార్టీ అభ్యరిగా పోటీచేసిన గుడివాడ గురునాథరావు విజయం సాధించారు. అదే సమయంలో విశాఖ ఎంపీగా పూసపాటి ఉమాగజపతిరాజు ఎన్నికయ్యారు. 1999లో జరిగిన జమిలి ఎన్నికల్లోనూ ఇదే పంథా కొనసాగింది. టీడీపీ నుంచిపెతకం శెట్టి గణబాబు ఎమ్మెల్యేగా, ఎంవీవీఎస్ మూర్తి ఎంపీగా విజయం సాధించారు. 2004లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసిన తిప్పల గురుమూర్తిరెడ్డి శాసనసభ్యుడిగా, నేదురుమల్లి జనార్దనరెడ్డి విశాఖ ఎంపీగా విజయబావుటా ఎగురవేశారు.

పునర్విభజన తరువాత తారుమారు

పునర్విభజన తరువాత పెందుర్తి శాసనసభ నియోజకవర్గం అనకాపల్లి లోకసభ పరిధిలోకి వచ్చింది. 2009లో అనకాపల్లి నుంచి లోకసభకు కాంగ్రెస్ ఎంపీగా సబ్బంహరి గెలుపొందగా, పెందుర్తి నుంచి ప్రజారాజ్యం పార్టీ నుంచి పంచకర్ల రమేశ్ బాబు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత మళ్లీ పాత పంథా కొనసాగింది. 2014లో జరిగిన జమిలి ఎన్నికల్లో ఎంపీగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందు ర్తి నుంచి ఎమ్మెల్యేగా బండారు సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. 2019లో వైసీపీ నుంచి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎమ్మెల్యేగా గెలుపొందగా, అనకాపల్లి ఎంపీగా వైసీపీ అభ్యర్థి భీశెట్టి సత్యవతి విజయం సాధించారు. తాజాగా కూటమి నుంచి పెందుర్తి అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు(జనసేన), అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్(బీజేపీ), వైసీపీ పెందుర్తి అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ వైసీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలునాయుడు బరిలో ఉన్నారు. ఈ సారి పెందుర్తి ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారోనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

● పెందుర్తి


పెందుర్తి జంక్షన్

సర్పంచ్ స్థాయి నుంచి చట్ట సభలోకి...

సబ్బవరం మండలం నుంచి ఇద్దరు

సబ్బవరం మండలం నుంచి ఇద్దరు సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. అందులో ఒకరు గొటివాడ గ్రామానికి చెందిన సాలపు చినఅప్పలనాయుడు, మరొకరు మొగలిపురానికి చెందిన గండి బాబ్జీ...


గొటివాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే, దివగత సాలాపు

సాలపు చినఅప్పలనాయుడు...

మండలంలోని గొటివాడ కుగ్రామం. ఆ గ్రామానికి చెందిన స్వర్గీయ సాలాపు చిన అప్పలనాయుడు పూర్వీకులు మయన్మార్‌లో స్థిరపడ్డారు. ఆయన అక్కడే జన్మించారు. 1943లో మయన్మార్ నుంచి గొటివాడ వచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై చినఅప్పలనాయుడు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం 1956లో ఫిర్కా డెవలప్‌మెంట్ అధికారిగా, మండల అభివృద్ధి సలహా మండలి ఛైర్మన్‌గా పనిచేశారు. 1959లో గొటివాడ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా పనిచేస్తూ..1959లో సమితి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1961లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1962 ఎన్నికల్లో పరవాడ నియోజకవర్గం సీటు ఆశించారు. అధిష్ఠానం వేరొకరికి ఇవ్వడంతో చినఅప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత ఆయన్ను కాంగ్రెస్ మళ్లీ పార్టీలో చేర్చుకుంది. ఆ విధంగా ఆయన చట్ట సభల్లోకి అడుగుపెట్టారు. 1984లో చినఅప్పలనాయుడును కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. 1984 వరకూ ఆ పదవిలో కొనసాగారు. చిన అప్పలనాయుడు 2007లో కన్నుమూశారు.


మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ

ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు కృషి

అప్పట్లో పరవాడ నియోజవర్గంలో ఒకే ఒక జెడ్పీ హైస్కూల్ ఉండేది. అదీ సబ్బవరంలో ఉండేది. ఈ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు చినఅప్పలనాయుడు కృషిచేశారు. కళాశాల ఏర్పాటుకు కార్పస్ ఫండ్ కట్టాల్సి రాగా తన సొంత సొమ్ము చెల్లించారు. కొంతకాలం కళాశాల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. అలాగే స్వగ్రామంలో సొంత భూమి 10 సెంట్లు దానం చేసి ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు కృషిచేశారు. పాల సొసైటీ ఏర్పాటుకు 10 సెంట్లు ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదేవిధంగా మరో నాయకుడు బొండా అచ్చన్నతో కలసి సబ్బవరంలో పీఏసీఎస్ ఏర్పాటుకు ఎకరా స్థలం దానంగా ఇచ్చారు. సమితి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో గ్రామానికి ఒకేసారి 209 ఇళ్లు మంజూరు చేయించారు.

గండి బాబ్జీ...

మండలంలోని మొగలిపురంలో పుట్టిన గండి బాబ్జీ న్యాయ విద్యను అభ్యసించారు. న్యాయవాది వృత్తిలో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తుండేవారు. మొగలిపురానికి ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా పనిచేశారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు శిష్యుడుగా గుర్తింపుపొందారు. 2004లో పరవాడ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన చొరవతో సబ్బవరానికి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరయింది. ప్రస్తుతం గండి బాబ్జీ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు.

● సబ్బవరం

భానుడు భగ భగ

▸ అల్లాడిపోయిన ప్రజలు



నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న పరవాడ సంతబయలు

పరవాడ, మే 6 : పారిశ్రామికవాడగా పేరొందిన పరవాడ ప్రాంతంలో ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పరవాడ, పరిసర ప్రాంతాల్లో సోమవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండలకు తోడు విపరీతమైన వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండకు తోడు ఉక్కపోత తోడవ్వడంతో వృద్ధులు, చిన్నపిల్లలు మరింత అవస్థలు పడాల్సి వచ్చింది. ఎండల కారణంగా ఉదయం పది గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రం ప్రధాన రహదారి వెలవెలబోయింది.

నమూనా బ్యాలెట్‌తో ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, మే 6 : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ నమూనా బ్యాలెట్‌లతో కూటమి నేతలు పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. సోమవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఏడో వార్డులోని పల్లివీధి, తోకలవారివీధి తరతర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు నమూనా బ్యాలెట్‌ల ద్వారా ఓటు ఎలా వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వేములపూడి అప్పారావు, కొప్పుల రాజారమేశ్, పెదిరెడ్డి పండు, నారపురెడ్డి వాసు, కుంచె సత్తిబాబు, ఆచంట శ్రీను, జానకి రాము, కనకం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి-అచ్యుతాపురం మధ్య ట్రాఫిక్ జామ్



కొత్తూరు బ్రిడ్జిపై బారులు తీరిన వాహనాలు

ఎలమంచిలి, మే 6: తాళ్లపాలెం సమీపంలో ప్రధాని నరేంద్రమోదీ సభ సందర్భంగా పోలీసు అధికారులు వాహనాలను దారి మళ్లించడంతో ఎలమంచిలి-అచ్యుతాపురం మధ్య ట్రాఫిక్ జామ్ అయ్యింది. తుని నుంచి వచ్చే వాహనాలు ఎలమంచిలి, అచ్యుతాపురం మీదుగా... విశాఖ నుంచే వచ్చే వాహనాలను లంకెలపాలెం నుంచి అచ్యుతాపురం మీదుగా ఎలమంచిలి చేరుకుని రేగుపాలెం మీదుగా తుని వైపు మళ్లించారు. దీంతో ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం మీదుగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొందరు వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పేదల భూములను దోచుకోవడమే జగన్ అజెండా

▸ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, మే 6 : పేదల భూములను దోచుకోవడమే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అజెండా అని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం దిబ్బపాలెం, ఊడేరుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. పేదలు తమ భూములపై హక్కులను కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే కాకుండా పేదల కడుపు కొట్టేందుకు వైసీపీ నాయకులు తెగబడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

875 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ఎలమంచిలి, మే 6: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఇక్కడ ఐదు పోలింగ్ బూత్‌లను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. తొలి రోజు 878 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,105 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించనున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకునేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి మనోరమ పర్యవేక్షణలో ఓటింగ్ ప్రక్రియ సాగింది.

జనసేనలో పలువురు చేరిక



జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలతో పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, మే 6 : మండలంలోని గుల్లేపల్లికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు సోమవారం జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన గండి శ్రీనివాస్, బొబ్బిలి సన్యాసిరావు, మునగపాక వెంకటరావు, బంగారాజు, నెల్లి అప్పన్న, లావేటి శ్రీను తదితరులకు జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భరణికాన బాబూరావు, అండిబోయిన బంగారయ్య, ఫల్గుణ, రాజేశ్, గజ్జి నరసింగరావు, దొడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజూ ఏడి 'పింఛెన్'

▸ వృద్ధులకు తప్పని అగచాట్లు

కోటవురట్ల, మే 6: ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో వృద్ధులకు ఐదో రోజూ కూడా ఆపసోపాలు తప్పడం లేదు. బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ లావాదేవీలు జరగక అకౌంట్‌ను అప్‌డేట్ చేయాల్సి రావడం, ఆధార్ అనుసంధానం లేకపోవడం ఫింగర్ ప్రింట్లు స్కాన్ కాకపోవడం వంటి సమస్యలతో అనేకమంది వృద్ధులు, పింఛన్లు తీసుకోలేకపోయారు. మరో వైపు మండుటెండలో విలవిలలాడుతూ బ్యాంకు సేవా కేంద్రాలకు చేరుకున్నారు. అలసి సొలసి వెళ్లిన వారు కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశం లేక అక్కడ మరిన్ని ఇక్కట్లు పడుతున్నారు. తమపై ప్రభుత్వం కనికరం లేకుండా ఇబ్బంది పెట్టడం తగదని వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాతాల్లో నగదు జమ అయినా ఆరో తేదీకి కూడా డబ్బులు చేతికి రాకపోగా రోజూ ఎండలో బ్యాంకులకు రావడానికి నరకయాతన పడుతున్నామని వారు వాపోతున్నారు. కోటవురట్లలో స్టేట్‌బ్యాంకు, యూనియన్ పింఛనుదారులతో కిటకిటలాడాయి. బీకేపల్లి గ్రామానికి చెందిన రమణమ్మ మాట్లాడుతూ తనకు 72 సంవత్సరాలని, కంటి చూపు తగ్గిందన్నారు. బ్యాంకులో పింఛన్ సొమ్ము జమ చేశారని, మరో మనిషి తోడు లేకపోతే బ్యాంకు రాలేనన్నారు. ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తే బాగుంటుందని ఆమె పేర్కొంది.

నక్కపల్లిలో.. ప్రతీ నెలా ఇంటి వద్దే పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నారు. మే నెల ఆరో తేదీ వచ్చినప్పటికీ ఇంకా చాలా మంది వృద్ధులు పెన్షన్లు పొందలేకపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నక్కపల్లి ఐవోబీ వద్ద వందల సంఖ్యలో వృద్ధులు, మహిళలు పెన్షన్ల కోసం పడిగాపులు పడడం కనిపించింది. బ్యాంకు ఆవరణ, పరిసరాల్లో వృద్ధులు పెన్షన్ల కోసం రెండు,మూడు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వృద్ధులు ఉదయం 9 గంటలకే ఐవోబీకి చేరుకున్నారు.



కోటవురట్లలో స్టేట్‌బ్యాంకుకు పింఛన్ల కోసం తరలివచ్చిన వృద్ధులు



పెన్షన్‌దారులతో కిక్కిరిసిపోయిన నక్కపల్లి ఐవోబీ



97వ వార్డు కార్మిక నగర్‌లో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు



పెదయాతపాలెం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పంచకర్ల

కార్మికులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

జనసేన పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, మే 4: వైసీపీ ప్రభుత్వం కార్మికులను దగా చేసిందని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు మండిపడ్డారు. 97వ వార్డు పరిధి సుజాతనగర్ సమీపంలోని కార్మికనగర్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గాజు గ్లాసు గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, కమలంపై ఓటు వేసి అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ఇసుకాసురల్లా మారి ఇసుకను దోచేసి భవన నిర్మాణ కూలీల పొట్ట కొట్టారన్నారు. దీంతో కార్మికులకు ఉపాధి లేక బతుకులు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బటన్ నొక్కుడుతో రూ.వంద ఇచ్చి రూ.వెయ్యి గుంజిన సీఎం జగన్‌కు కార్మికులంతా ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. వైసీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం జగన్‌కు బై.. బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాగా పంచకర్లకు అడుగడుగునా ప్రజలు పూలమాలలు వేస్తూ, హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, నాయకులు సేనాపతి సోమశేఖర్, కిశోర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రానికి భవిత

సబ్బవరం: ఎన్నికల్లో కూటమి విజయంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని జనసేన 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని బంగారమ్మపాలెం, చినబంగారమ్మపాలెం, యాతపాలెం, ఆరిపాక, లగిశెట్టిపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పూర్తిగా మద్యనిషేధాన్ని అమలు చేసిన తర్వాతే 2024లో ఓట్లు అడిగేందుకు ప్రజల ముందుకు వస్తానని బీరాలు పలికిన సీఎం జగన్ ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో నాసిరకం మద్యం ఏరులై పారుతుందని, దీనిని తాగి ఎంతోమంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నాయకులు లోకల్ అంటూ తాము చేసిందేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందినవారే బాగుపడ్డారని, ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల సమస్యలన్నింటినీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సహకారంతో చిత్తశుద్ధితో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శరగడం రాము, ఆడారి నాగరాజు, వెంకట్, రమేశ్‌రాజు, చినరాజు, దొడ్డి ప్రకాశ్, కన్నంనాయుడు, పైడింనాయుడు, బంగారయ్య, ఇందలి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

▸ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మే 6: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే ప్రజారంజక పాలన సాధ్యమవుతుందని జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం జంపపాలెంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన విజయకుమార్‌కు కూటమి శ్రేణులు, మహిళలు పూలమాలలు వేసి, హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై సుందరపు గ్రామ వీధుల్లో ప్రచారం చేపట్టారు. అనంతరం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి అధినేతలు ముందుకు వచ్చారన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం రానున్న ఎన్నికల్లో పార్లమెంటు బీజేపీ అభ్యర్థి సీఎం. రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన అసెంబ్లీ అభ్యర్థి పోటీచేస్తున్న తనకు గుర్తు గ్లాసుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీను, స్థానిక నేతలు పాల్గొన్నారు.



జంపపాలెం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సుందరపు విజయకుమార్

ఉత్సాహంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం

నక్కపల్లి, మే 6: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి పలువురు ఉద్యోగులు సోమవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఏర్పాట్లు సక్రమంగా చేయకపోవడం వల్ల దాదాపు 3 గంటల పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో జాప్యం జరిగిందని పలువురు ఉద్యోగులు విలేకర్లకు తెలిపారు. ఉపాధ్యాయులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు సర్కారుపై తమ కసి తీర్చుకోవాలన్న ఉద్దేశంతో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం 1,414 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం వుందని అధికారులు తెలిపారు.



ఉత్తరాంధ్రకు వైసీపీ ద్రోహం

... 5వ పేజీ తరువాయి

కలిశాయని, ఉత్తరాంధ్ర క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని చంద్రబాబు ధీమా వ్యక్తంచేశారు. కొన ఊపిరితో ఉన్న రాష్ట్రానికి మళ్లీ ఆక్సిజన్ ఎక్కించాల్సి ఉందని, బాగు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ బృహత్తరమైన యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మంచి మెజారిటీతో గెలిపించాలి..

ఉత్తరాంధ్రలోని పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చంద్రబాబునాయుడు కోరారు. సీఎం రమేశ్ రాజ్యసభ సభ్యునిగా పనిచేశాడని, వైసీపీ నుంచి పోటీ చేస్తున్న వ్యక్తికి భాష రాదని, ఢిల్లీలో వీధులు కూడా తెలియవన్నారు. ఢిల్లీ తెలిసిన వ్యక్తి, కేంద్ర పెద్దలతో సన్నిహితంగా ఉండే వ్యక్తిని గెలిపిస్తే పెట్టుబడులు వస్తాయన్నారు. విశాఖపట్నం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీభరత్‌ను, అరకులోయ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను, విజయనగరం అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని చంద్రబాబునాయుడు కోరారు.

జగన్‌కు ఉద్యోగులు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాకలు సంబంధించి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి పలువురు ఉద్యోగులు సోమవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 45 శాతానికి పైగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాలకు ఒక్కొక్కటి చొప్పున, ఇతర జిల్లాల వారికి ఒకటి, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

క్రీడా మైదానంలో పాడైన బోరు

ఎలమంచిలి, మే 6: స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో చేతిబోరు మరమ్మతులకు గురైంది. దీంతో క్రీడాకారులు గుక్కెడు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. ఈ బోరు రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. దీనిని మరమ్మతు చేయించడంలో మునిసిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిత్యం ఈ క్రీడా మైదానంలో వందలాది మంది క్రీడాకారులు తర్ఫీదు పొందుతున్నారు. దీనికి తోడు ఇటీవల వేసవి హాకీ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ వేసవికి క్రీడాకారులు తెచ్చుకున్న తాగునీటి సీసాలు ఖాళీ అయిపోతున్నాయి. దీంతో తాగునీటి కోసం వారు వెంపర్లాడుతున్నారు. చేతిబోరును మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

పోటెత్తిన ప్రజా గళం

... 5వ పేజీ తరువాయి

విచ్చేశారు. మోదీకి హెలీప్యాడ్ వద్ద అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పీవీఎన్ మాధవ్‌లు స్వాగతం పలికారు. ప్రధాని మోదీ సభా వేదికపైకి వచ్చిన వెంటనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన రాష్ట్ర నాయకులు నాగబాబు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

అర్ధగంటకు పైగా సాగిన ప్రధాని ప్రసంగం...

ముందుగా ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో అధికార వైసీపీ పాలనపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ సాగించిన ప్రసంగానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఆయన మాట్లాడుతున్నప్పుడు జనాలు నినాదాలు చేస్తూ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో తండ్రి (వైఎస్ రాజశేఖరరెడ్డి) శంకుస్థాపన చేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులను కొడుకు (జగన్మోహన్‌రెడ్డి) ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, అంటే దీన్నిబట్టి చూస్తే రైతుల పట్ల వైసీపీకి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అనకాపల్లి జిల్లాలో చెరకు రైతులు ఎక్కువగా ఉన్నారని, అటువంటి ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీలను మూతపడడంతో రైతులు కష్టాల పాలయ్యారన్నారు. వైఎస్ఆర్ పార్టీ అనగానే అందరికీ గుర్తుకువచ్చేది ఇసుక మాఫియా, భూదందా, లిక్కర్ స్కామ్‌లు అని ప్రధాని విమర్శలు గుప్పించిన సందర్భంలో ప్రజలు కేరింతలు కొట్టారు. నింగినంటాయి. సుమారు అర్ధగంటకు పైగా సాగిన ప్రధాని ప్రసంగంలో రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడితే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యమని అన్నారు. మోదీ ప్రసంగం అనంతరం జరిగిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రసంగానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. చంద్రబాబు ప్రసంగంలో పదే పదే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేరును ప్రస్తావించడంతో సభకు హాజరైన జనం నుంచి విశేష స్పందన వచ్చింది. మోదీ, చంద్రబాబు ఉమ్మడి ఆధ్వర్యంలో జరిగిన సభ విజయవంతం అవడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది.

కూటమి సభకు అనకాపల్లి కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నీ తానై వ్యవహరించి జనసమీకరణ చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగబాబు, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత, చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గణబాబు, టీడీపీ సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు, బుద్ద నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నూకాంబిక నెల పండగ



అనకాపల్లి టౌన్, మే 6 : స్థానిక నూకాంబిక అమ్మవారు కొత్త అమావాస్య జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారి నెల పండగ జరగనుంది. భక్తుల దర్శనార్థం సోమవారం రాత్రంతా ఆలయాన్ని తెరిచి ఉంచారు. నెల పండగలో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలో కోలాటాలు, లలిత సహస్రనామ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు బాలాలయంలో అమ్మవారి దర్శనం ఉంటుంది. ఆరు గంటల తరువాత భక్తులకు దర్శనం నిలిపివేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమావాస్య పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం మూసివేసి బుధవారం తెల్లవారుజామున ఆరు గంటలకు తెరుస్తామని ఆలయ ఈవో తెలిపారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

పరవాడ, మే 6 : మండలంలోని నాయుడుపాలెంలోని సిద్ధి వినాయక ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు స్వామివారి ఆలయం వద్ద బారులు తీరారు. వినాయకున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. కూండ్రపు శ్రీను ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఉపమాక ఆలయ వేలం పాటలు రుషికొండలోనా..?

నక్కపల్లి, మే 6: టీటీడీ అధికారుల అనాలోచిత చర్యలు ఉపమాక దేవస్థానానికి శాపంగా మారుతున్నాయి. భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఉపమాక దేవస్థానంలో ప్రతీ ఏటా భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కల బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. గత ఏడాది కూడా ఉపమాక దేవస్థానం వద్ద వేలం నిర్వహించగా రూ.2.55 లక్షలకు వేలం పాటను ఖరారు చేశారు. అయితే ఈనెల 8న కొబ్బరి చెక్కల బహిరంగ వేలాన్ని ఆలయం వద్ద కాకుండా విశాఖ రుషికొండ సమీపాన వున్న టీటీడీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు టీటీడీ అధికారులు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని స్థానికులు, పలువురు పాటదారులు ఆక్షేపిస్తున్నారు. తామంతా రుషికొండ వెళ్లి వేలంపాటలో పాల్గొనడం కష్టతరమవుతుందని, ఉపమాకలో యథావిధిగా వేలం పాట నిర్వహించాలని కోరుతున్నారు. దీనిపై స్థానికంగా వున్న ఆలయ అధికారిని సంప్రదించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రుషికొండలో 8న వేలం పాట నిర్వహిస్తామన్నారు.

ఉచిత ఫుట్‌బాల్ శిబిరం ప్రారంభం



ఉచిత ఫుట్‌బాల్ శిబిరాన్ని ప్రారంభించిన ప్రసాద్

అచ్యుతాపురం, మే 6: స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల క్రీడా ప్రాంగణంలో ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌ని విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతిభ ఉన్న ఫుట్‌బాల్ క్రీడాకారులున్నారని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేదన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీయాలనే ఉద్దేశంలో తాము ఈ శిబిరాన్ని ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ నెల రోజులు పాటు కొనసాగుతుందని, 12 నుంచి 18 వయస్సు గల బాలురు ఈ శిక్షణలో పాల్గొంటారన్నారు. ప్రతీ రోజు ఉదయం ఐదున్నర నుంచి ఎనిమిది గంటల వరకు శిక్షణ నిస్తామన్నారు. ఈ శిబిరానికి ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు సిద్దు కోచ్‌గా వ్యవహరిస్తారని. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో కూటమి నేతలు ఇంటింటా ప్రచారం

అచ్యుతాపురం, మే 6: మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఖాజీ పాలెంలో మాజీ సర్పంచ్ పీలా తులసీరామ్, సందీప్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కుమారపురంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. పూడిమడకలో బీజేపీ నేత ఒరుపుల జైశంకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈకార్యక్రమాల్లో వెంకటరమణ, బేరా శంకరరావు, నందవరపు గంగారాజు, లక్ష్మణ, కొండబాబు, తురాయి రాము తదితరులు పాల్గొన్నారు.

పెదకలావపల్లి రైతులను ఆదుకోవాలి



రైతుల నిరసనకు మద్దతు తెలిపిన డాక్టర్ చిన్నియాదవ్

రాంబిల్లి, మే 6 : మండలంలోని పెదకలావపల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ డీఆర్‌డీవో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణం వల్ల ఇబ్బంది పడుతున్న రైతులను ప్రభుత్వాలు, అధికారులు ఆదుకోవాలని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో నిరసన చేస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో 500 కుటుంబాలు కొండ వద్ద పశువుల పాకలు ఏర్పాటు చేసుకొని, ఆవులు, గేదెలు, మేకలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కొండ పక్క నుంచి నుంచి ఉన్న దారులు ద్వారా రైతులు తమ పొలాలకు వెళ్లేవారని, ప్రహరీ గోడ నిర్మాణంతో రైతులు నష్టపోతున్నారన్నారు. పాలకులు, అధికారులు రైతులకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళ చేస్తామని డాక్టర్ చిన్నియాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ కన్వీనర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు రావిదేముళ్ళు, రైతులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈ ఫలితాల్లో గుడ్‌షెపర్డ్ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి టౌన్, మే 6 : స్థానిక గుడ్‌షెపర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ కరస్పాండెంట్ ఎ. పాల్ ధర్మదాస్ సోమవారం తెలిపారు. ఈ పరీక్షా ఫలితాల్లో స్కూల్ విద్యార్థి బుద్ధ లవీత్రేయ 94.1 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థిని కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని లవీత్రేయను అభినందించిన కరస్పాండెంట్ పాల్ ధర్మదాస్

నర్సీపట్నం నియోజకవర్గం

నేడు అల్లూరి శతవర్ధంతి

కృష్ణాదేవిపేట, మే 6 : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి మంగళవారం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని అల్లూరి యువజన సం ఘాలు, ప్రజలు నిర్వహించాలని అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో కోరారు. గత ఐదేళ్లుగా పాలకులు కృష్ణాదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కును అభివృద్ధి చేస్తామని ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఇటువంటి వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

నాతవరంలో సినిమా షూటింగ్


టిఫిన్ సెంటర్ వద్ద హీరో, హీరోయిన్‌పై సన్నివేశం

నాతవరం, మే 6 : మండల కేంద్రం నాతవరంలో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'మధు బాల' చిత్రానికి సంబంధించి హీరో గోపీకృష్ణ, హీరోయిన్ శివ ప్రసన్నలపై ఇక్కడి టిఫిన్ సెంటర్ వద్ద ఓ సన్నివేశాన్ని తెరకెక్కించారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు చుట్టు పక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

ఉత్తరాంధ్రకు వైసీపీ ద్రోహం

... 5వ పేజీ తరువాయి

కలిశాయని, ఉత్తరాంధ్ర క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని చంద్రబాబు ధీమా వ్యక్తంచేశారు. కొన ఊపిరితో ఉన్న రాష్ట్రానికి మళ్లీ ఆక్సిజన్ ఎక్కించాల్సి ఉందని, బాగు చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ బృహత్తరమైన యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మంచి మెజారిటీతో గెలిపించాలి..

ఉత్తరాంధ్రలోని పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చంద్రబాబునాయుడు కోరారు. సీఎం రమేశ్ రాజ్యసభ సభ్యునిగా పనిచేశాడని, వైసీపీ నుంచి పోటీ చేస్తున్న వ్యక్తికి భాష రాదని, ఢిల్లీలో వీధులు కూడా తెలియవన్నారు. ఢిల్లీ తెలిసిన వ్యక్తి, కేంద్ర పెద్దలతో సన్నిహితంగా ఉండే వ్యక్తిని గెలిపిస్తే పెట్టుబడులు వస్తాయన్నారు. విశాఖపట్నం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీభరత్‌ను, అరకులోయ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను, విజయనగరం అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని చంద్రబాబునాయుడు కోరారు.

ఓటు కోసం ఉద్యోగులు క్యూ

- పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం
- నియోజకవర్గంలో 2,369 ఓట్లు
- తొలిరోజు 45 శాతం పైగా పోలింగ్


నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఉపాధ్యాయులు


ఫారం-12ను పరిశీలించి బ్యాలెట్ సీరియల్ నంబర్ వేస్తున్న పోలింగ్ సిబ్బంది

నర్సీపట్నం, మే 6 : పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ తొలి రోజు ప్రశాంతంగా సాగింది. నర్సీపట్నంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 45 శాతానికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సీపట్నానికి ఒకటి, మాకవరపాలేనికి ఒకటి, నాతవరం, గొలుగొండ మండలాలకు ఒకటి, ఇతర జిల్లాల వారికి ఒకటి, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకు ఒకటి చొప్పున ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ మండలాల్లో సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరుకానున్న 2,329 మంది ఉద్యోగులకు ఫారం-12లు అందజేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ సెంటర్‌లోకి అనుమతించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూ లైన్‌లో ఉండి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. కొంతమంది ఉద్యోగులు ఫారం-12 తీసుకొచ్చినప్పటికీ వారికి ఓటు లేకపోవడంతో మంగళవారం రమ్మని పంపించారు. పోలింగ్ సెంటర్‌లో వైసీపీ నాయకులు తిరుగుతుండడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం 2,329 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు 45 శాతం పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి జయరాం తెలిపారు.

ఆర్వోలకు అవగాహన కల్పించండి: అయ్యన్న

నర్సీపట్నం: రిటర్నింగ్ అధికారులకు అవగాహన లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులు కన్ఫ్యూజ్ అవుతున్నారని నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. పోస్టల్ బ్యాలెట్ మీద స్వస్తిక్ ముద్ర వేయాలా, టిక్కు పెట్టాలా అన్నది స్పష్టత ఇవ్వడం లేదన్నారు. నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి స్వస్తిక్ ముద్ర వేయవచ్చు, టిక్కు కూడా పెట్టవచ్చునని అంటున్నారని తెలిపారు. అదే విషయాన్ని లిఖిత పూర్వంగా రాసి ఇవ్వాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏ విధంగా సూచించిందో చెప్పాలని ఆయన కోరారు. రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అవగాహన కల్పించాలన్నారు.

తాగునీరు కలుషితంతో జనం ఆందోళన


బూరుగుపాలెం వెళ్లే రోడ్డులో కలుషితమవుతున్న నీరు

మాకవరపాలెం, మే 6 : తాగునీరు కలుషితం అవుతుండడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లచ్చన్నపాలెంలో రూ.పది కోట్లతో సర్పా నదిలో భారీ తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు పద్నాలు గ్రామాలకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందుతోంది. ఈ పైపులైన్లకు మధ్యలో కుండీలు నిర్మించి, వాల్స్ ఏర్పాటు చేశారు. ఈ వాల్స్ ద్వారా నీరు కుండీలకు వస్తుంది. ఈ నీటిని రోడ్డు పక్కల ఉన్న రైతులు వాడుతుంటారు. ఇదిలావుంటే, బూరుగుపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న పైపులైన్లలోకి ఆ పక్కనే ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీ నుంచి వచ్చే మురుగు వచ్చి చేరుతోందని, దీంతో నీరు కలుషితమవుతోందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అలాగే, కొన్నిచోట్ల పైపులైన్ల లీకేజీల వద్ద కలుషిత నీరు అందులోకి చేరుతుందని అంటున్నారు. ఈ నీటిని తాగుతుండడం వల్ల అంటువ్యాధుల భయం వెంటాడుతోందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

కొంగసింగిలో పునాదులకే పరిమితమైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం


పిల్లర్ల స్థాయిలో నిలిచిన భవన నిర్మాణం

కృష్ణాదేవిపేట, మే 6 : గొలుగొండ మండలం కొంగసింగిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం రెండేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ నిర్మాణ పనుల నిమిత్తం పంచాయతీరాజ్, ఎన్ఆర్‌జీఎస్ నుంచి రూ.పది లక్షలు మంజూరయ్యాయి. నాడు ప్రారంభించిన పనులు నేటికీ పునాదులకే పరిమితమయ్యాయి. బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం పిల్లర్ల కోసం వేసిన ఇసుప ఊచలు తుప్పుపడుతున్నాయి. భవనం పూర్తికాక వైద్య సిబ్బంది స్థానిక సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇదే పరిస్థితుల్లో ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం తదితర గ్రామాల్లోని భవనాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాలకు నో ఎంట్రీ

పాడేరు, మే 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని ఘాట్ మార్గాల్లో భారీ వాహనాలకు ప్రవేశం లేదని, ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాడేరు, అనంతగిరి, లంబసింగి, చింతూరు ఘాట్ మార్గాల్లో సరకులు రవాణా చేసే మల్టీయాక్సల్ వున్న భారీ వాహనాలను 10 నుంచి 14వ తేదీ వరకు నడపరాదని సూచించారు. ఈ నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లో ఉల్లంఘించకుండా రవాణా, రోడ్ల భవనాలు, పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోటెత్తిన ప్రజా గళం

... 5వ పేజీ తరువాయి

విచ్చేశారు. మోదీకి హెలీప్యాడ్ వద్ద అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పీవీఎన్ మాధవ్‌లు స్వాగతం పలికారు. ప్రధాని మోదీ సభా వేదికపైకి వచ్చిన వెంటనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన రాష్ట్ర నాయకులు నాగబాబు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

అర్ధ గంటకు పైగా సాగిన ప్రధాని ప్రసంగం...

ముందుగా ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో అధికార వైసీపీ పాలనపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ సాగించిన ప్రసంగానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఆయన మాట్లాడుతున్నప్పుడు జనాలు నినాదాలు చేస్తూ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో తండ్రి (వైఎస్ రాజశేఖర్‌రెడ్డి) శంకుస్థాపన చేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులను కొడుకు (జగన్మోహన్‌రెడ్డి) ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, అంటే దీన్నిబట్టి చూస్తే రైతుల పట్ల వైసీపీకి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అనకాపల్లి జిల్లాలో చెరకు రైతులు ఎక్కువగా ఉన్నారని, అటువంటి ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీలను మూతపడడంతో రైతులు కష్టాల పాలయ్యారన్నారు. వైఎస్ఆర్ పార్టీ అనగానే అందరికీ గుర్తుకువచ్చేది ఇసుక మాఫియా, భూదందా, లిక్కర్ స్కామ్‌లు అని ప్రధాని విమర్శలు గుప్పించిన సందర్భంలో ప్రజలు కేరింతలు కొట్టారు. నింగినంటాయి. సుమారు అర్ధగంటకు పైగా సాగిన ప్రధాని ప్రసంగంలో రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడితే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యమని అన్నారు. మోదీ ప్రసంగం అనంతరం జరిగిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రసంగానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. చంద్రబాబు ప్రసంగంలో పదే పదే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేరును ప్రస్తావించడంతో సభకు హాజరైన జనం నుంచి విశేష స్పందన వచ్చింది. మోదీ, చంద్రబాబు ఉమ్మడి ఆధ్వర్యంలో జరిగిన సభ విజయవంతం అవడంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. కూటమి సభకు అనకాపల్లి కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నీ తానై వ్యవహరించి జనసమీకరణ చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగబాబు, మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత, చోడవరం అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గణబాబు, టీడీపీ సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు, బుద్ధ నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం

ప్రధాని సభకు భారీగా తరలి వెళ్లిన కూటమి శ్రేణులు

రావికమతం, మే 6: ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి-తాళ్లపాలెం సమీపంలో రాజుపాలెం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన వికసిత భారత్ బహిరంగ సమావేశానికి మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. చినపాచిల, కేబీపీ అగ్రహారం, యర్రబంద, గుమ్మాళ్ల పాడు, రావికమతం, గర్నికం, మేడివాడ, టి.అర్జాపురం, కొత్తకోట,దొండపూడి, కిత్తంపేట, మరుపాక, గుడివాడ, గుడ్డిప.గొంప తదితర గ్రామాల నుంచి వేలాదిగా స్వచ్ఛందంగా బైక్‌లు, ఆటోలు, వ్యానులు, కార్లులో తరలివెళ్లారు.ఎండను సైతం లెక్కచేయకుండా జై చంద్రబాబు, జై నరేంద్రమోదీ, జై పవన్ అంటూ నినాదాల చేసుకుంటూ బయలు దేరారు.

జగన్‌కు ఉద్యోగులు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు సంబంధించి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి పలువురు ఉద్యోగులు సోమవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 45 శాతానికి పైగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాలకు ఒక్కొక్కటి చొప్పున, ఇతర జిల్లాల వారికి ఒకటి, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలకి ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.


చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటువేయడానికి నిల్చున్న ఉద్యోగులు


మాడుగుల కేంద్రంలో బారులు తీరిన ఉద్యోగులు

ఉత్సాహంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చోడవరం, మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం సోమవారం ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఆరు బూత్‌లలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఉద్యోగులతోపాటు, ఇతర ప్రాంతాల ఉద్యోగుల కోసం పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. కాగా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేసిన హైస్కూల్ మైదానంలో ప్రధాన రాజకీయపక్షాలకు చెందిన మద్దతుదారులు వేచి ఉండి తమకు తెలిసిన ఉద్యోగులను తమకు ఓటు వేసేలా అభ్యర్థించడం కనిపించింది.

ఉద్యోగి తప్పిదం.... పోలింగ్‌నకు అంతరాయం

ఉద్యోగుల ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన ఒకటో నంబరు బూత్‌లో విధుల్లో ఉన్న ఓ ఉద్యోగి చేసిన తప్పిదం వల్ల పోలింగ్‌నకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. ఓటు వేసిన ఉద్యోగి బ్యాలెట్ పత్రం ఒక చిన్న కవరులో పెట్టి సీల్ చేసి దానితోపాటు డిక్లరేషన్ ఫారాన్ని జత చేసి రెండింటినీ పెద్ద కవరులో పెట్టి బ్యాలెట్ బాక్స్‌లో వేయించాలి. అయితే పోలింగ్ కేంద్రంలో ఉన్న ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్‌ను చిన్న కవరులో, డిక్లరేషన్ ఫారంను పెద్ద కవరులో వేసి రెండు కవర్లను వేర్వేరుగా బాక్సులో వేయించారు. ఈ విధంగా సుమారు 30 వరకూ ఓట్లు వేయించినట్టు చెపుతున్నారు. అయితే ఈ తప్పిదాన్ని గమనించిన ఓ ఉద్యోగి పోలింగ్‌ను అడ్డుకుని ఆ ఉద్యోగిని గట్టిగా నిలదీసి, అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలింగ్ చాలాసేపు ఆగినట్టు సమాచారం.

ఇన్‌వ్యాలిడ్ భయం

ఈ దశలో ఆర్వో జోక్యం చేసుకుని విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. తరువాత నుంచి బ్యాలెట్ పత్రాన్ని చిన్న కవరులో వేసి సీల్ చేయించి దానికి డిక్లరేషన్ ఫారంను జత చేసి పెద్ద కవరులో రెండింటిని పెట్టి బ్యా లెట్ బ్యాక్సులో వేయించారు. దీనితో యథావిధిగా పో లింగ్ కొనసాగింది. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఉ ద్యోగి చేసిన తప్పిదం వల్ల ఆ ఓట్లు ఇన్‌వాలిడ్ అయ్యే ప్రమాదం ఉందని పార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు.


చోడవరంలో వేచిచూస్తున్న మహిళా ఉద్యోగినులు

మాడుగులలో 31శాతం పోలైన ఓట్లు

మాడుగుల: సార్వత్రిక ఎన్నికలు ఈనెల 13న జరగనున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కు స్పందన లభించింది. మాడుగుల నియోజకవర్గంలో సాయంత్రం 6గంటలకు 31శాతం ఓట్లు నమోదయ్యాయి. దీనికి సంబంధించి ఈవో జీవి.సత్యవాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గంలో 2480 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా, వీటిలో 755 పోలయ్యాయని తెలిపారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 వరకు స్థానిక ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలో ఆరు గదుల్లో ఈ పోలింగ్ సాగింది. ఇప్పటివరకూ ఫారం-12 తీసుకోలేని ఉద్యోగులకు అందించి ఓట్ల నమోదుకు అవకాశం కల్పిస్తున్నామని ఆర్వో తెలిపారు. ఈ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఈనెల 8వ తేదీ వరకూ జరుగుతుంది. పోలింగ్‌ను నోడల్ అధికారి ఈశ్వరమ్మ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు భోజన సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రాజ పాల్గొన్నారు. ఎస్ఐ దామోదరనాయుడు ఆధ్వర్యంలో బందో నిర్వహించారు.

ఏకపక్షంగానే పోస్టల్ బ్యాలెట్ పోరు?

- ఉద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేకత

చోడవరం: ప్రభుత్వ ఉద్యోగుల కోసం సోమవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన పోస్టల్ ఓటింగ్‌లో ప్రభుత్వ వ్యతిరేకత ఏకపక్షంగా కొనసాగినట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తెలియచెప్పాలన్న పట్టుదల ఉద్యోగులు ఓట్లు వేసినట్టు సమాచారం. దీనికితగినట్టుగానే ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉం ది. ప్రత్యేకించి మహిళా ఉద్యోగులు తమ ఓటు హ క్కు వినియోగించుకున్నారు. ఓ టింగ్ సందర్భంగా చాలా మంది ఉద్యోగులు కూటమి అభ్యర్థులకు మద్దతుగానే ఓటింగ్ వేసినట్టు లోపాయకారీగా తమ అభిప్రాయాన్ని వెల్లడించడం విశేషం. పోస్టల్ ఓట్ల కోసం అధికార పార్టీ నాయకులూ పోలింగ్ కేంద్రం స మీపంలో ఉండి ప్రలోభాలకు గురిచేసినా, వాటిని కాదని చాలామంది ఉద్యోగులు ప్రభుత్వంపై వ్యతిరేకత తెలిపినట్టు తెలిసింది. ఈ స్థితిలో పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థుల విజయం ఏకపక్షంగానే ఉంటుందని సర్వత్రా వినిపిస్తోంది.

మాడుగుల నియోజకవర్గం

జైతవరంలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీ


జైతవరంలో ముగ్గుల పోటీని తిలకిస్తున్న గ్రామస్థులు

చీడికాడ, మే 6: మండలంలోని జైతవరం గ్రామంలో సో మవారం శ్రీఅభయాంజనేయస్వామి తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వేకువజామునుంచి పూజలు చేశారు. అనంతరం ముగ్గుల పో టీలను నిర్వహించారు. గెలుపొందిన 10మందికి బహుమతుల కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు అందించారు.

చర్చ లేకుండానే ముగిసిన మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బలక్ష్మి

దేవరాపల్లి, మే 6: మూడు నెలలకోసారి జరిగిన మండల సర్వసభ్య సమావేశం సమస్యలపై చర్చించకుండానే ముగిసిపో యింది. ఎన్నికల కోడ్ ఉన్నందున అభివృది అంశాలపై సమీ క్షించలేకపోయారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం లో ఈ సమావేశం అధికారులు నిర్వహించారు. గ్రామాల్లో ప్రధా నంగా ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్ సమస్యలపై సభ్యు లు మాట్లాడాలని సూచించడంతో ఎవరూ స్పందించలేదు. చాలామంది మౌనంగానే ఉండిపోయారు. ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీలు చింతల. బుల్లిలక్ష్మి, భవాని, ఎంపీటీసీ సభ్యులు సూపరింటెండెంట్ జీవీ రమణ పాల్గొన్నారు.

కాలువల్లో మురుగు తిష్ఠ ..పొంచి ఉన్న వ్యాధులు భయం

దండిసురవరం గ్రామంలో పారిశుధ్య లోపం

చీడికాడ, మే 6: మండలంలోని దండిసురవరం గ్రామంలో పారిశుధ్య లోపంతో వ్యాధుల భయం పొంచిఉంది. అనేకచోట్ల డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో గ్రామస్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత వేసవిలోకూడా దొర్లవీధి కాలువ, రామకోవెల సమీపంలోని వాటర్‌ట్యాంకు పక్కన ఉన్న డ్రైనేజీ వాటర్‌ట్యాప్ పక్కన ఉన్న డ్రైనేజీలోను, పంచాయతీ కార్యాలయం వెనుకభాగంలో మురుగునీరు నిల్వలతో స్థానికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కాలువల్లో రోజుల తరబడి మురుగునీరు నిలిచి నాచు పట్టి కనిపిస్తున్నాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి ప్రబలే అవకాశముందని వాపోతున్నారు. గ్రామ పంచాయతీకి ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పారిశుధ్యం మెరుగుపరచడంలో శ్రద్ధ వహించకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. వర్షాకాలంలో పారిశుధ్యం మరీ దారుణంగా ఉంటోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీటి నిల్వలను తొలగించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


చెత్తచెదారంతో పేరుకుపోయిన డ్రైనేజీ


జనావాసాల మధ్య దుస్థితి

పెన్షన్ కోసం వృద్ధులకు పాట్లు

దేవరాపల్లి, మే 6: ప్రతి నెలా ఒకటో తేదీన ఇళ్ల వద్ద పెన్షన్ ఇచ్చిన ప్రభుత్వం ఈనెల బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 8 వేల మందికి ఖాతాల్లో పింఛన్లు జమ చేశారు. అయితే, ఖాతాలు మనుగడలో లేకఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

ఆరురోజులుగా తిరుగుతున్నా..



జువ్వాలయ్య (తెనుగుపూడి) పెన్షన్ కోసం ఆరురోజులుగా ఐదుకిలో మీటర్లు నుంచి వస్తున్నా పనికావడం లేదు.నాలానే చాలామంది ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో పెన్షన్ ఇస్తే ఇబ్బంది ఉండేది కాదు.

చీడికాడ: ప్రభుత్వ నిర్లక్ష్యంతో అవ్వా తాతలకు మం డుటెండకు గురవుతున్నారు. నడవలేనివారికి ఇళ్ల వద్దనే పింఛన్‌లు ఇవ్వాలని ఆదేశాలున్నా అములకాక పలువురికి అవస్థలు తప్పడంలేదు. బ్యాంకు ఖాతాల్లో పింఛన్‌సొమ్ము జమచేయడంతో గత వారం రోజులుగా వృద్ధులు, దివ్యాం గులు మండుటెండల్లో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటోంది. మిగతా ఖాతాదారులతో సహా వృద్ధులు అధిక సంఖ్యలో రావడంతో ఉదయం నుంచి సాయం త్రం వరకూ బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రవాణా సదుపాయం లేని గ్రా మాల నుంచి వృద్ధులు ముగ్గురు నలుగురు చొప్పున ఆటోలకు అధికరేట్లు చెల్లించి బ్యాం కుల వద్దకు వచ్చి అవస్థలకు గురవు తున్నారు. కాగా, మండలంలో 8813మందికి పింఛన్‌లు ఇవ్వాల్సి ఉంది. వీరిలో 2265 మంది దివ్యాంగులు, వృద్ధులు, మంచంపై ఉన్న వారికి ఇళ్ల వద్దనే సచివాలయ సిబ్బంది చెల్లించి మిగతా వారికి బ్యాంకు ఖాతాలకు వేశామని మండల పరిషత్ అధికారులు తెలిపారు. దీంతో అగచాట్లు తప్పడంలేదు.


చీడికాడలో ఎండలో వెళ్తున్న వృద్ధులు